విశాలాంధ్ర కృష్ణా జిల్లా

మహిళా సాధికారతే లక్ష్యంగా..

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : రాష్ట్రంలో మహిళా సాధికారత లక్ష్యంగా స్వయం సహాయక మహిళ సంఘాలు పటిష్టంగా పనిచేస్తున్నాయని, ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేయడంలో వీటి పాత్ర వెలకట్టలేనిదని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. గురువారం జరిగిన కార్యక్రమంలో కలెక్టరేట్ ఆవరణలో రూ.5 కోట్లతో నిర్మించనున్న శిక్షణ సాంకేతిక అభివృద్ధి కేంద్రం (టిటిడిసి) మరియు జిల్లా సమాఖ్య భవనాలకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి రాజశేఖర్ జిల్లా కలెక్టర్ పి రాజాబాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2000 సంవత్సరంలో ఏర్పాటైన మహిళా స్వయం సహాయక సంఘాలు దినదిన ప్రవర్ధమానమై సంస్థాగతంగా బలోపేతం అయ్యాయని అన్నారు. మహిళా సంఘాలు పొదుపు చేయడం, రుణాలు తీసుకోవడం, తిరిగి కట్టడం జరుగుతోందని, తద్వారా దేశంలో బ్యాంకులు మంజూరు చేస్తున్న రుణాలలో మన రాష్ట్ర మహిళా స్వయం సహాయక సంఘాలే 30 శాతం భాగస్వామ్యంతో పాటు, బ్యాంకు రుణాలు రూ.20 లక్షల వరకు పొందుతున్నారని, రుణాల తిరిగి చెల్లింపు 99% కలిగి ఉన్నాయని తెలిపారు. ఇలాంటి వ్యవస్థ మిగతా దేశాల్లో, రాష్ట్రాల్లో లేదన్నారు. మహిళల సాధికారత విలువ తెలిసిన మన ముఖ్యమంత్రి వీటి బలోపేతానికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే. చంద్రశేఖరరావు, డిఆర్డిఏ పిడి పిఎస్ఆర్ ప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఇ విజయకుమారి, జెడ్పి సిఈఓ జ్యోతి బసు, డ్వామా పిడి జీవి సూర్యనారాయణ, డిపిఓ నాగేశ్వరనాయక్, ఏపిఎంలు సీసీలు కలెక్టరేట్ సిబ్బంది స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సిద్ధం కండి

కృష్ణాజిల్లా కలెక్టర్ రాజబాబు కలెక్టరేట్లోనే తన ఛాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూజిల్లాలోని విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులు సబ్జెక్ట్ టీచర్లత/అధిక ఉత్తీర్ణత శాతం సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయండి ప్రతి ఒక్క విద్యార్థిని ఉత్తీర్ణులయ్యే విధంగా కృషి చేయాలి ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఏపీఆర్ఎస్, మున్సిపల్, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్, ఎయిడెడ్ పాఠశాలల్లో గణనీయమైన ఉత్తీర్ణత శాతం పెంచే దిశగా ప్రతి ఒక్క పాఠశాలలో గత సంవత్సర కంటేఉత్తీర్ణత శాతానికి మించి మెరుగైన ఫలితాలను సాధించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. పరీక్షలు జరిగే సమయం నాటికి విద్యార్థులకు నిత్యం ఆయా సబ్జెక్టుల్లో పరీక్షలను నిర్వహిస్తూ వారిలో ఉన్న భయాన్ని పోగొట్టాలన్నారు. అదేవిధంగా చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి అన్ని విషయాలు అర్థం అయ్యేలా ఓర్పుతో వివరించి ప్రతి ఒక్క విద్యార్థి ఉత్తీర్ణులయ్యే విధంగా కృషి చేయాలన్నారు. పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిడితో ఉంటారని, వారి తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి కుటుంబ పరమైన సమస్యలు వారిని దరిచేరనివ్వకుండా ప్రశాంతత నింపే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన ఏర్పరచాలని సూచించారు. విద్యార్థులకు నిత్యం పౌష్టికాహారం అందిస్తున్నామని, అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇదే విషయాన్ని వారి తల్లిదండ్రులకు సైతం తెలియపరచాలని స్పష్టం చేశారు. విద్యార్థులు, టీచర్ల మధ్య ప్రేమ ఆప్యాయతలు గల వాతావరణం ఉండాలని, తద్వారా మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థుల జీవితం టీచర్ల చేతుల్లోనే ఉందని, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు కీలకమైన ఈ నెల రోజులు అహర్నిశలు కృషి చేయాలని కలెక్టర్ సూచించార. పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఫెయిల్ అయిన సబ్జెక్టు టీచర్లపై చర్యలు తీసుకుంటామని ఈ విషయంలో టీచర్లు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా విద్యాశాఖ అధికారిణి తాహెర సుల్తానా ఇతర అధికారులు పాల్గొన్నారు.

సామాజిక ఆర్థిక భరోసా

విశాలాంధ్ర-కూచిపూడి : రాష్ట్రంలో వివిధ సామాజిక వర్గాలకు ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమన్యాయం చేయడమే కాకుండా సామాజికంగా ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నారని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. మొవ్వ మండలం పెదసనగల్లులో కొనసాగుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం కురుస్తున్న అధికమంచు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, అలాగే సంక్షేమ పథకాలు కులమాత ప్రాంతీయ బేధాలు లేకుండా ప్రతి ఒక్కరికి అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను సంక్షేమ పథకాలు వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అన్నామణి, మండల పార్టీ అధ్యక్షులు రాజులపాటి రాఘవరావు, పలువురు నాయకులు, అధికారులు హాజరయ్యారు.

గుడ్లవల్లేరుకు గవర్నర్ అబ్దుల్ నజీర్

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల 25 వసంతాలు సందర్భంగా ఈ నెల 16, 17, 18 తేదీల్లో రజతోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు, ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గవన్నర్ అబ్దుల్ నజీర్ రానున్నారని ప్రిన్సిపాల్, రజతోత్సవ వేడుకల కన్వీనర్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ తెలిపారు. ఈ నెల 16వ తేదీన జరిగే ప్రారంభోత్సవ వేడుకకు ముఖ్య అతిథిగా ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి, విశిష్ట అతిథిగా రాష్ట్ర పూర్వ ఐ.టి. సలహా దారులు మరియు సి.ఎం.డి. వ్యవస్థాపకులు డాక్టర్ త్రిపురనేని హనుమాన్ చౌదరి, రెండవ రోజైన 17వ తేదీన జరుగు అలుమినీ డే మరియు పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. హేమచంద్ర రెడ్డి, గౌరవ అతిథిగా జే.ఎన్.టి. యూ.కె. కాకినాడ ఉపకులపతి డాక్టర్ జి.వి.ఆర్. ప్రసాద రాజు, 18వ తేదీన జరిగే రజతోత్సవ ముగింపు వేడుకల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ విచ్చేయనున్నట్లు రజతోత్సవ వేడుకల కన్వీనర్ తెలిపారు. వివిధ విద్యా విషయక అంశాలపై 16వ తేదీన రెండు, 17వ తేదీన ఒకటి పేనల్ డిస్కషన్స్ (ముఖాముఖీ చర్చలు) నిర్వహిస్తునట్లు, సంస్కృతిని ప్రతిబింబించేలా పలు సాహిత్య సంగీత నాట్య కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. అదే రోజు సాయంత్రం సినీ సంగీత దర్శకులు అనూప్ రూబెన్ అండ్ బృందం చే మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నామన్నారు. అంతే కాకుండా 16, 17 తేదీలలో టెక్ ఎక్స్పో పేరిట సాంకేతిక విలువలతో కూడిన నూతన ఆవిష్కరణల ప్రదర్శనను కూడా ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మరియు కన్వీనర్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలిపారు. క్రమ శిక్షణాయుత వాతావరణంలో రజతోత్సవ వేడుకలను జరిపించుటకు కళాశాల సిబ్బంది మరియు యాజమాన్య సభ్యుల సహాయ సహకారాలతో తగిన ఏర్పాట్లను చేశామని ప్రిన్సిపాల్ మరియు కన్వీనర్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు తనిఖీ చేసిన ఎస్ఐ శ్రీనివాస్

విశాలాంధ్ర-కూచిపూడి : మువ్వ మండలం లోని కొన్ని పోలింగ్ కేంద్రాలను కూచిపూడి ఎస్సై టి. శ్రీనివాస్ గురువారం సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆ కేంద్రాలకు అవసరమైన గాలి, వెలుతురు, మంచినీరు, విద్యుత్తు, బాత్ రూం లాంటి అవసరమైనసౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే కేంద్రాలకు ప్రహరీ గోడల సౌకర్యంల నుసైతం పరిశీలించారు. ఆయన గూడపాడు, కూచిపూడి, పెదపూడి, కొండవరం, పెదముత్తేవి, చినముత్తేవి, పాలంకీపాడు గ్రామాలలోగల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి

విశాలాంధ్ర-కూచిపూడి : వచ్చే నెలలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతకుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పిల్లలను చదివించాలని మొవ్వ మండల విద్యాశాఖాధికారిణి-2 కే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఆమె కూచిపూడి శ్రీ సిద్దేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్లో నిర్వహిస్తున్న నాల్గవ సైకిల్ టెస్టులో భాగంగా గురువారం సాయంత్రం హిందీ పరీక్షా పత్రాన్ని రాస్తున్న పిల్లల విద్యా ప్రతిభను పరీక్షించారు. ప్రతిరోజు సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు నిర్వహించే ప్రత్యేక తరగతుల ద్వారా ప్రతి సబ్జెక్టును క్షుణ్ణంగా చదివిస్తూ పరీక్షలలో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఆ అంశాలలో వారిని తీర్చిదిద్దడానికి కృషి సల్పాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.ఎస్. సాయికుమార్, ఉపాధ్యాయులు గుంటూరు వెంకట సత్య ప్రసాద్(సంస్కృతం), బండారు మాణిక్యాలరావు (ఇంగ్లీషు), అల్లంసుమిత(హిందీ) లు పాల్గొన్నారు.

ఉపాధిపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పై సామాజిక తనిఖీ ప్రజా వేదికను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 2022-2023 ఆర్థిక సంవత్సరాలలో మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం పై సోషల్ ఆడిట్ నిర్వహించారు.ఆడిట్ బృందం సేకరించిన మండలంలోని 22 పంచాయితీలలో 8 కోట్లతో జరిగిన పనుల వివరాలు, అవకతవకలు, సిబ్బంది నిర్లక్ష్య వైఖరి వలన ఏర్పడిన పొరపాట్లు,వాటి వల్ల ప్రజా ధనం దుర్వినియోగం వంటి పలు అంశాలను జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యనారాయణ పరిశీలించారు. ఈ నివేదికల పరిశీలనా క్రమంలో మండల టెక్నికల్ అసిస్టెంట్ పనుల నిర్వహణలో, జియో ట్యాగ్ చేయడంలో చూపించిన నిర్లక్ష్య ధోరణిపై మండిపడుతూ ఉన్నతాధికారుల చర్యలకు నివేదిస్తామన్నారు. తద్వారా ఏర్పడిన నష్టంపై 1 లక్షా 14వేల 380రూపాయలను టిఏ, ఏపీఓ, ఎఫ్ఎలకు జరిమానాగా, 63వేల 684 రూపాయలు తిరిగి రికవరీ ఆదేశించారు. అలాగే పనుల వివరాలు తెలుపవలసిన బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వారం రోజుల్లో బోర్డు లు ఏర్పాటు చేయకపోతే 3లక్షల75వేలు కూడా తిరిగి రికవరీ చేయాలని ఎపిడి నాంచారయ్య, ఎస్ఆర్పి రాజులు ఆదేశించినట్లు ఎపిఓ రామ్ ప్రసాద్ గురువారం వెల్లడించారు.

జగన్‌తోనే రాష్ట్రం అభివృద్ధి : ఉప్పాల

విశాలాంధ్ర-బంటుమిల్లి :- రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మీరంతా జగనన్నకు అండగా నిలవాలని ,ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆయన్ను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్ సిపి పెడన నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి ఉప్పాల రాము పిలుపునించారు .మండల పరిదిలోని పెదతుమ్మిడి గ్రామ సచివాలయ పరిదిలోని పలుగ్రామాలలో ప్రజాదీవెన యత్రాను ఉప్పాల రాము గురువారం ప్రారంభించరు .ఈ సందర్భంగా ఉప్పాల రాము మాట్లడుతూ ప్రజాసంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి కృషి చేస్తున్నారని ,అయన నాయకత్వాన్ని బలపరచాలని ప్రతి గృహాన్ని సందర్శించి ప్రజలకు వివరిస్తు వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు .రానున్న సార్వత్రిక ఎన్నికలలో అందరు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భవిష్యత్తు తరాలకు మరింత సంక్షేమాన్ని అందించే జగనన్న ను ముఖ్యమంత్రిగా చేసుకుందామని అన్నారు .తొలుత పెదతుమ్మిడి గ్రామంలోని ప్రముఖ శివాలయంలో గ్రామ ప్రముఖులు ,వైఎస్సార్ సిపి నాయకులు మట్ట నాగబాబు సారథ్యంలో ఉప్పాల రాము ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితుల ఆశీస్సులు తీసుకున్నారు .ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు స్నానం మహేష్ ,పార్టీ నాయకులు ,కార్యకర్తలు ,గ్రామాలలోని ప్రజలు పాల్గోన్నారు.

206 మంది మహిళలకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-గుడివాడ : దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన అహింస సాంప్రదాయ సేవా హాస్పటల్ ప్రాంగణంలో గర్భిణీ స్త్రీల పోషకాహార నిమిత్తం నిర్వహించిన ఆర్థిక సహాయ పంపిణీ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పాల్గొని ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున 206 మంది మహిళలకు ఆర్థిక సహాయ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ 1929లోనే మహిళల పట్ల ఉన్నత ఆలోచనలతో ఇంతటి గొప్ప కార్యక్రమాలు నిర్వహించిన రామచంద్రరావుని ప్రతి ఒక్కరు అభినందించాలన్నారు. ఆయన పేరు మీద నేటికి కొనసాగుతున్న ఇంతటి మంచి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవోలు వైసిపి నాయకులు మండలి హనుమంతరావు, మెరుగుమాల కాళీ, మాదాసు వెంకటలక్ష్మి, చంద్రాల హరిరాంబాబు, పద్మావతి, దేవదాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ అంధకారం చేసుకోవద్దు

విశాలాంధ్ర-కూచిపూడి : బహిరంగ ప్రదేశాలలో అల్లర్లు చేస్తూ, ఈవ్.టీజింగ్ నిర్వహిస్తూ భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని కూచిపూడి పోలీసులు విద్యార్థులకుహితబోధచేశారు. మొవ్వ బస్ స్టేషన్ లో గురువారం సాయంత్రం పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు విడిచిపెట్టిన అనంతరం బస్ స్టేషన్ లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులకు అవగాహన కల్పించి పలు సూచనలను ఇచ్చేచైతన్య పరిచారు. విద్యాసంస్థల్లోకానీ, బహిరంగ ప్రదేశాలలో గాని, బస్టాండ్లలో గాని ఆడపిల్లలను వేధించడం చట్టరీత్యా నేరమని ఈ విధమైన అసాంఘిక చర్యలకు పాటుపడి పోలీసు రికార్డులలోకి నమోదు కావద్దని హితవుపలికారు.

సంగీత, జ్ఞానప్రదాయనికి వీణా వాద్య నీరాజనాలు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో గురువారం ఉదయం అష్టమ వార్షిక అఖండ కచ్ఛపీ మహోత్సవం ఘంటసాల సంగీత కళాశాల కళావేదికపై జరిగింది. విద్య, జ్ఞానప్రదాయని సరస్వతి దేవి పుట్టినరోజున రెండు తెలుగు రాష్ట్రాల లోని వైణిక విద్వాంసులు దాదాపు 50 మంది ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 వరకు వారి వారి వీణా వాద్యంతో అమ్మవారికి నీరాజనాలర్పించారు. సరస్వతీ దేవి, శ్యామలాదేవి వీణతో దర్శనమిస్తారు. బ్రహ్మాండ పురాణంలో హయగ్రీవుడు తెలిపినట్టు శ్యామలాదేవి మంత్రం సంగీత యోగిని నామంతో ప్రారంభమవుతుంది. సంగీతానికి అధిదేవత అమ్మవారు. సంగీత యోగం ద్వారా సమస్త సిద్ధులను సాధించే శక్తిని జగన్మాత ప్రసాదిస్తుంది. అమ్మవారిని వైణికి, వీణావతి అని కూడా పిలుస్తారు. వీణానాదాన్ని శ్రవణం చేసేవారికి బ్రహ్మానంద స్థితి కలుగుతుందని హయగ్రీవుడు తెలిపాడు. తెలుగు రాష్ట్రాలలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించిన సుప్రసిద్ధ వైణిక విద్వాంసులు వాసా కృష్ణమూర్తి, ఈమని శంకరశాస్త్రి, సంగమేశ్వర శాస్త్రి, పప్పు సోమేశ్వరరావు, అయ్యగారి సోమేశ్వరరావు, డాక్టర్ సి చిట్టిబాబు లను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న ఈ ఉత్సవం పొట్లూరి భారతీ కుమారి, ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలల సౌజన్యంతో సమితి ప్రధాన కార్యదర్శి సివి రావు పర్యవేక్షణలో జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు కె ఎస్ గోవిందరాజన్, అయ్యగారి సత్యప్రసాద్, చిట్టా కార్తీక్, కొండా శశిధర్, శిష్టు గౌరీశంకరశాస్త్రి తదితరులు వరుసగా వీణావాదనం చేసి వినిపించారు.

18న కబడ్డీ జట్ల ఎంపిక

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఈ నెల 18 వ తేది ఉమ్మడి కృష్ణాజిల్లా పురుషులు మరియు సబ్ జూనియర్స్ బాల బాలికల కబాడ్డీ జట్టుల ఎంపిక అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని కృష్ణాజిల్లా కబాడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషుల యొక్క బరువు 85 కేజీల లోపు, సబ్ జూనియర్స్ బాల బాలికల బరువు 55 కేజీల లోపు ఉండాలని, సబ్ జూనియర్స్ బాల బాలికల సెలక్షన్‌లో పాల్గోనడానికి మార్చి 19 2008వ తేది తరువాత పుట్టిన వారు మాత్రమే అర్హులని చెప్పారు. పాల్గోనే క్రీడా కారులు వచ్చేటప్పుడు ఒరిజినల్ ఆధార్ కార్డులతో రావాలని తెలియచేశారు. మరిన్ని వివరాలకు 9704063555 లను సంప్రదించాలన్నారు.

ప్రకటన

నా క్లయింట్లు అశ్విని కుమార్ షరాఫ్, తండ్రి తేజ్ బాన్ షరాఫ్ & చేతన్ షరాఫ్, తండ్రి అశ్విని కుమార్ షరాఫ్, ఆర్/ఓ.. ఫ్లాట్ నెం.308, డోర్ నెం.39-10-1/2, అంజనా అపార్ట్‌మెంట్, లబ్బీపేట, విజయవాడ వారి సంజాయిషీ పొంది, యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు చలేంద్ర అరుణ్ సాయి కృష్ణ, తండ్రి పెద్దబాబు గారి నుండి దిగువ షెడ్యూలు స్థిరాస్తిని ఖరీదు చేయదలచి యున్నారు. సదరు షెడ్యూలు ఆస్తిని చలేంద్ర అరుణ్ సాయి కృష్ణ గారు వంగా సురేష్ బాబు తండ్రి వంగా జోసెఫ్ బాలస్వామి (లేటు) గారి నుండి ది.25-06-2022వ తేదీన దాక్యుమెంట్ నెం.6034/2022గా బుక్ నెం1, జాయింటు సబ్‌రిజిస్ట్రారు, గన్నవరం కార్యాలయము నుండి రిజిష్టరు దస్తావేజు పొందియున్నారని తెలియజేసినారు. కావున దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనను ఎటువంటి చెల్లదగు క్లయిములు, కోర్టు తగాయిదాలు, ఇంజక్షన్లు, తనఖాలు, జాయింటు భాగలబ్ధి తగాయిదాలు, మనోవర్తి క్లయిములు, మొదలగునవి వున్నయెడల ఈ ప్రకటన వెలువడిన ఏడు(7) దినములలోగా ఈ దిగువ తెలియపరచిన అడ్రసుకు లిఖితపూర్వకముగా, Regd.post with acknowledgement due ద్వారా తెలియ పరచగలరు. సదరు గడువులోగా ఎటువంటి అభ్యంతరములు రానియెడల షెడ్యూలు ఆస్తిని నిర్వివాద ఆస్తిగా యెంచి క్రమమైన రిజిష్టర్డు సేల్‌డీడ్‌ను పొందగలరనియు, తదుపరి వచ్చు క్లయిములు నా క్లయింట్లను బైండు చేయజాలవని తెలియపరచడమైనది.

షెడ్యూలు:- కృష్ణాజిల్లా, గన్నవరం సబ్‌రిజిస్ట్రారు వారి యిలాకా, గన్నవరం మండలం పెదపావులూరు గ్రామ శివారు, ముస్తాబాద గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన, వెదురు పావులూరు గ్రామ ఆర్.ఎస్.నెం.306/6 రు దాఖలా చ.గ. 1306.80 లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు. తూర్పు: గరిమెళ్ళ పుష్పావతి గారి భూమి. దక్షిణం: ఆర్.ఎస్.నెం.308/1 రు దాఖలా భూమి. పడమర: వంగా శ్రీలత గారి ఈ నెంబరులో భూమి. ఉత్తరం: గరిమెళ్ళ సుబ్బారావు గారి భూమి. ఈ నాలుగు హద్దుల మధ్య చ.గ. 1306.80లు లేక చ.మీ. 1092.64లు స్థిరాస్తి నివేశన స్థలము యావత్తు యీజ్‌మెంట్ హక్కులతో సహా.

ఎస్.ఎస్.వి. శ్రీనివాసరావు, బి.కామ్,బి.ఎల్, అడ్వకేట్

Flat No.106,anjana apartment,
Watertank Road,Labbipet, Vijayawada -10.
విజయవాడ, తేది:10-2-2024

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మానక్ పోటీకి అభిరామ్

విశాలాంధ్ర-బంటుమిల్లి :- కంకిపాడు మండలం గోసాల శ్రీ చైతన్య పాఠశాలలో నిర్వహించిన ఇన్‌స్పైర్ మానక్ కృష్ణాజిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించి రాష్ట్రస్థాయికి కొమ్మారెడ్డి విద్యార్థి ఎ అభిరామ్ ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ గురువారం తెలిపారు. ఈ నెల 14వ తేదీన నిర్వహించిన ఇన్‌స్పైర్ మానక్ పోటీలలో 11 మంది విద్యార్థులు పాల్గోనగా స్థానిక కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్ విద్యార్థి ఎ అభిరామ్ (10వ తరగతి) రాష్ట్రస్థాయి నిర్వహించే ఇన్‌స్పైర్ మానక్ పోటీకి ఎంపికై య్యాడని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 18వ తేదిన చిత్తూరు జిల్లాలో నిర్వహి స్తారన్నరు. ఈ విద్యార్థికి సైన్స్ ఉపాధ్యాయురాలు సిహెచ్ రేవతి గైడ్ గా వ్యవహరించా రన్నారు. అనంతరం కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా చేతులమీదుగా విద్యార్థి అభిరామ్ కు బహుమతి ప్రధానం చేశారన్నారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ ,ఉపాధ్యాయిని ,ఉపాధ్యాయులు అబినందనలు తెలిపారు.

చంద్రబాబుకు అవకాశం ఇవ్వండి : కుమార్ రాజా

విశాలాంధ్ర-పెదపారుపూడి : ప్రజాసేవ చేయడానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడుకు మరోక అవకాశం, తనకు ఒక్క అవకాశం కల్పించమని టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా గురువారం అన్నారు. మండలంలోని పల్లెబాట పల్లెనిద్ర 5వ రోజు అప్పికట్ల, వింజనంపాడు, జువ్వనపూడి, చినపారుపూడి, గ్రామాలలో పల్లెబాట సందర్భంగా ఇంటి ఇంటికి తిరుగుతూ ప్రజాసేవ చేయడానికి తనకు ఒక అవకాశం, చంద్రబాబుకు మరోక అవకాశం ఇవ్వమని గ్రామీణ ప్రాంత ప్రజలను ప్రాదేయపడి వర్ల కుమార్ రాజా రెండు చేతులు జోడించి వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, పార్లమెంటు నియోజకవర్గం నాయకులు సూరపనేని వెంకట సత్యనారాయణ, దానబోయిన వెంకటనారాయణ, కలపాల కిషోర్ మండల నాయకులు పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సూరపనేని వెంకటరమణ బాబు, కొమ్మ నారాయణస్వామి, వంపుగాని సుభోస్, జుజ్జువరపు బాజీ, చిలకా ధనరాజు, గోగం రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి

విశాలాంధ్ర-కూచిపూడి : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా శాంతియుత వాతావరణం లో జరగటానికి గ్రామ ప్రజలు, పలు పార్టీల నాయకులు పూర్తి సహకారం ఇవ్వాల్సిందిగా కూచిపూడి ఎస్సై తల్లిబోయిన శ్రీనివాస్ సూచించారు. ఆయన గురువారం మండలంలోని అవురిపూడి,మంత్రిపాలెం, నిడుమోలు తదితర ప్రధాన, శివారు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు పలు హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలనుతెలియపరుస్తూ ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే గ్రామాలలో కోడిపందాలు, పేకాట, చిత్తు లాట, మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరిక జారీ చేశారు. సమస్యాత్మక గ్రామాలలో ఏ విధమైన అల్లర్లు జరగకుండా గ్రామ పెద్దలు పర్యవేక్షించి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సాయం

విశాలాంధ్ర-అవనిగడ్డ : అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సోసైటీ సాయం అందచేశారు. ఈ నెల 12 వ తేది సోమవారం రాత్రి అవనిగడ్డ సివారు వసుమట్ల కాలనీకు చెందిన రెండు కుటుంబాలకు చెందిన గృహాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. విషయం తెలుసుకున్న ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ కృష్ణాజిల్లా అవనిగడ్డ శాఖ చైర్మన్ వంగర శేషగిరిరావు ఆద్వర్యంలో ఒకొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, 31 వస్తువులు గల వంట పాత్రల బాక్స్, వంట సరుకులు, కూరగాయాలను రెడ్ క్రాస్ సోసైటీ ప్రసిడెంట్ తహశీల్దార్ ఎం సునీల్ కుమార్ చేతుల మీదుగా బాధితులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ స్టేషన్ ఫైర్ అధికారి ఎస్.వి.వి. ప్రసాద్, ఆర్.ఐ చైతన్య, ప్రభుత్వ డిగ్రి కళాశాల యూత్ రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ ఎ వీర కుమారి, బచ్చు ఆదినారాయణ, యూత్ రెడ్‌క్రాస్ విద్యార్ధిని విద్యార్థులు తదితరులు పాల్గోన్నారు.

మొవ్వ మండలంలో 'సేవావజ్ర'కు ఇద్దరు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వమండలంలో ఉత్తమ సేవలందిస్తున్న 326 మంది వలంటీర్లలో ఎంపికైన ఏడుగు రిలో ఇద్దరికి సేవా వజ్ర, ఐదు గురికి సేవా రత్న అవార్డును త్వరలో కైవసం చేసుకోమన్నారు. ఈ ఏడాది సేవా వజ్రకు గతంలో ఇచ్చే రూ.30 వేలను పెంచి రూ.45 వేలు, సేవా రత్నకు గతంలో రూ.20 వేలు ఇవ్వగా దానిని రూ.30 వేలకు పెంచారు. సేవా మిత్రకు గత ఏడాది వరకు ఇచ్చిన రూ.10 వేలను ఈ ఏడాది రూ.15 వేలకు పెంచి అందజేస్తున్నారు. ఈ విషయాన్ని ఆయా సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు గురువారం వెల్లడించారు. "సేవావజ్ర"కు కూచిపూడి సచివాలయంలోని కంచర్ల కళిందిని(బార్లపూడి), భట్లపెనుమర్రు సచివాలయంలోని జూనపూడి సంధ్యారాణి ఎంపికైనారు. అలాగే "సేవారత్న"కు వంపుగానిరాము (కూచిపూడి), కైలతేజాసురేంద్ర (పెదపూడి), మురారి వీర అమలేశ్వరరావు(వేములమడ), ఆలూరి శ్రీనివాసరావు (భట్ల పెనుమర్రు), మద్దాల దీప్తి (కోసూరు) ఎంపికైనారు. మిగిలిన వాలంటీర్లకు "సేవా మిత్ర"తో సత్కరించనున్నారు. వీరందరిని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ,ఆయా గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,ఎంపీపీ కొండేటి ఇందిర, ఎండిఓ జి చంద్రశేఖర రావు, ఈవోపీఆర్డి వీర్ల సీతారామరాజు పత్రికా ముఖంగా అభినందించారు.

సమస్యలపై సీఎం ఇంటిని ముట్టడిస్తాం : కొలికపూడి

విశాలాంధ్ర-ఎ కొండూరు : ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎలాంటి త్యాగానికి వెనకాడనని అవసరమైతే పాదయాత్రగా వెళ్లి తాడేపల్లిలోని ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తానని అమరావతి జేఏసీ కన్వీనర్ కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు ఏ కొండూరు మండలానికి గత 20 రోజులుగా నిలిచిపోయిన కృష్ణా జలాలను సరఫరా చేయాలని కోరుతూ గురువారం ఏ కొండూరు అడ్డరోడ్ నుండి విజయవాడలోని కలెక్టరేట్ కు నీటి సత్యాగ్రహ యాత్రను టిడిపి నాయకులు కార్యకర్తలు గిరిజన మహిళలతో కలిసి కళీ బిందెలతో విజయవాడ భద్రాచలం రహదారిపై నీటి సత్యాగ్రహ పాదయాత్రను ప్రారంభించారు పాదయాత్ర భారీ పోలీస్ బందోబస్తు మధ్య అడ్డ రోడ్డు నుండి కృష్ణారావు పాలెం పంచాయతీ పరిధిలోని దీప్లా నగర్ కు వచ్చేసరికే కృష్ణ జలాలతో ఉన్న ట్యాంకర్లు అక్కడికి రావడంతో ఆయన పాదయాత్రను నిలిపివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వేదికలపై నా ఎస్టీలు నా ఎస్సీలు నా బీసీలు నా మైనార్టీలు మైకులు పగిలేలా ప్రసంగాలు చేస్తారని వారి సమస్యలను మాత్రం ముఖ్యమంత్రి పట్టించుకోరని ఎద్దేవా చేశారు. తిరువూరు నియోజకవర్గంలోని కిడ్నీ బాధితులకు కనీసం తాగు నీటిని కూడా సరఫరా చేయలేని స్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని ఆరోపించారు. తాగు సాగునీరు పూర్తిస్థాయిలో సరఫరా అయ్యేవరకు ఊరుకునేది లేదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు త్రాగునీటి కొరకు సత్యాగ్రహ పాదయాత్రలు చేయవలసిన దుస్థితి ఏర్పడిందని అన్నారు తాము పాదయాత్ర చేపట్టామని తాత్కాలికంగా నీటి సరఫరా ప్రారంభించి మరల ఆపితే ప్రభుత్వం త్రివర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు గద్దె కృష్ణారెడ్డి మాజీ ఏఎంసీ చైర్మన్ ఆలవాల రమేష్ రెడ్డి మండల పార్టీ ఉపాధ్యక్షుడు పీక్ల నాయక్ బి బీమా నాయక్ మోర్ల తిరుపతిరావు బెజవాడ శంకర్ పిన్నమనేని శ్రీనివాసరావు యలినేని చంద్రశేఖర రావు సాధం నరసింహ వనపర్ల డేవిడ్ రాజు జంగా కిషోర్ మేకల రామారావు నాయకులు కార్యకర్తలు గిరిజన మహిళలు పాల్గొన్నారు.

బకాయిల నివేదిక ఇవ్వండి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావలసిన బకాయిల మొత్తంలో ఉద్యోగులకు, ప్రభుత్వానికి అపోహలు తలెత్తకుండా వివిధ రూపాల్లో తమకు రావలసిన బకాయిల మొత్తాన్ని ప్రభుత్వమే బహిరంగ నివేదిక ద్వారా ప్రకటించాలని డిమాండ్లను పరిష్కరించ కుంటే ఉద్యోగుల సత్తా చూపటానికి సిద్ధం గా వున్నారని ఎన్టీఆర్ జిల్లా జేఏసీ చైర్మన్ ఎ. విద్యాసాగర్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని కోరుతూ రాష్ట్ర జేఏసీ ప్రకటించిన నిరసన కార్యక్రమాలలో భాగంగా గురువారం నగరంలోని పంచాయితీ రాజ్ శాఖ కార్యాలయ ప్రాంగణంలో భోజన విరామ సమయ నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ ఇటీవల మంత్రుల బృందంతో జరిపిన చర్చల్లో కూడా ఉద్యోగ సంఘాలు చెబుతున్న మొత్తం, ప్రభుత్వం ప్రకటిస్తున్న అంకెలకు మధ్య రూ.4 వేల కోట్ల పైబడి తేడా ఉందన్నారు. ఉద్యోగ సంఘాల లెక్క ప్రకారం 25500 కోట్ల రూపాయలు రావాలని వివరించామన్నారు. కానీ ప్రభుత్వం 20,500 కోట్ల రూపాయల మాత్రమే బకాయి ఉన్నామని పేర్కొనడంతో ఉద్యోగులలో కొత్త ఆందోళన మొదలైందన్నారు. తాము ప్రభుత్వం నుంచి కొత్తగా ఏమి కోరడం లేదన్నారు. ప్రభుత్వం నుంచి మేము ఏదో కొత్తగా ఆశిస్తున్నామనే అపవాదు తమపై లేకుండా ప్రభుత్వం బహిరంగ నివేదికతో ముందుకు రావాలన్నారు. ఈనెల 27వ తేదీ వరకు తమ ఆందోళన వివిధ స్థాయిల్లో ఉంటుందన్నారు. 12వ పీ ఆర్ సి కమీషన్ నియమించినప్పటికీ నేటికీ ఏ మాత్రం ప్రగతి లేదు. సంఘాలతో చర్చించి, జిల్లాల పర్యటనలు, ఉద్యోగుల నుండి సమాచారాన్ని సేకరించి అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ను సమర్పించేందుకు చాలా గడువు కావాల్సి ఉంటుందన్నారు. 01-07-2023 నుండి 12వ పి ఆర్ సి అమలు కావలసి ఉందన్నారు. కానీ ఇప్పటివరకు పిఆర్సి కమిషన్ పూర్తిస్థాయిలో కార్యాచరణ ప్రకటించకపోవడం విచారకరమన్నారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులే కాకుండా పెన్షనర్లు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, రోజువారి జీతం పై ప్రభుత్వంలోని వివిధ శాఖలలో బాధ్యతలు నిర్వహిస్తున్న కార్మికులు కూడా ప్రభుత్వ నిర్లక్ష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ తమ శాఖలో మూడు వేల బస్సుల కొరత ఉన్నప్పటికీ ప్రభుత్వం గడువు తీరిన బస్సులను మరమ్మత్తులు చేసి నడిపించడం వల్ల ఉద్యోగులు వృత్తిపరంగా తీవ్రమైన ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధి జి. నారాయణరావు మాట్లాడుతూ రిటైర్ అయిన ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ తర్వాత సాధారణంగా వచ్చే అనారోగ్య సమస్యలకు వైద్య సదుపాయం కూడా లభించడం లేదన్నారు. ప్రభుత్వం ఆస్పత్రులకు చెల్లించాల్సిన తన వాటా చెల్లించకపోగా ఉద్యోగుల నుంచి మినహాయించుకున్న సొమ్మును సైతం ప్రభుత్వం తన వద్ద ఉంచుకోవడం బాధాకరమన్నారు. ఐటిఐ మరియు డి ఎల్ టి ఉద్యోగుల సంఘం ప్రతినిధి కృష్ణ కిషోర్ మాట్లాడుతూ తమ శాఖలో ఉన్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశంలో జాప్యం చేయకుండా సత్వరమే వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం ప్రతినిధి ఎండి ఇక్బాల్, రాష్ట్ర జేఏసీ కార్యనిర్వహక కార్యదర్శి కె. జగదీష్, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగుల సంఘం ప్రతినిధి ఎ. సాంబశివరావు, నీటిపారుదల, జలవనరుల శాఖ జేఏసీ ప్రతినిధి వై. లంకేశ్వరరావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ప్రతినిధి ఒ. సాయిరాం, రాష్ట్ర రహదారులు మరియు భవనముల శాఖ ఉద్యోగుల సంఘం నాయకులు మంగేశ్వరరావు, రవాణా శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎం. రాజబాబు, పంచాయతీరాజ్ డిప్లమా ఇంజనీర్ల సంఘం ప్రతినిధి కె. రవీంద్రబాబు తదితరులతోపాటు ఏపీ జేఏసీ లో భాగంగా ఉన్న వివిధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, ప్రభుత్వం నిద్రమత్తు వదలాలంటూ ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

నేత్రల పట్ల అప్రమత్తత అవసరం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): నేత్రాలపై అప్రమత్తంగా ఉండాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి పి.లక్ష్మణస్వామి అన్నారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మణస్వామి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నేత్రాలను నిర్లక్ష్యం చేస్తే చాలా మూల్యాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు. విజయవాడ విన్ విజన్ ఐ హాస్పిటల్స్ డాక్టర్ నిశాంత్‌జనార్ధన్‌రాజ్ మాట్లాడుతూ నేత్రాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జే లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, ఎన్ఎస్ఎస్ పీవో శ్రీకాంత్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

దోమతెరలు కప్పుకొని తిరగాల్సిందే...

- నగరంలో విజృంభిస్తున్న దోమలు
- నియంత్రించడంలో పాలకులు విఫలం
- సీపీఐ వినూత్న నిసనలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ నగరంలో దోమతెరలు కప్పుకొని తెరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. దోమలను నియంత్రించాలని సీపీఐ 58వ డివిజన్ ఆధ్వర్యంలో గురువారం వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. దోమతెరలు కప్పుకొని పాలకులు, అధికారులు దోమలను నియంత్రించడంలో విఫలం చెందారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీ.కోటేశ్వరరావు మాట్లాడుతూ బయటకు వెళ్తితే దోమలు, ఇంట్లో ఫ్యాను ఆపితే గుయ్ అంటూ దోమలు సవారీ చేస్తున్నాయని అన్నారు. దోమలు నివారించాల్సిన పాలకులు, అధికారులు నిద్దరోతుంటే, అవి స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. వాటి బెడదను తట్టుకోలేక దోమలను చంపుతూ విజయవాడ వాసులు జాగారం చేస్తున్నారని అన్నారు. నగరంలో 49 వైసీపీ కార్పొరేటర్లు, ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారని, వారికి ప్రజల ఆరోగ్యాల పై ఏమాత్రం శ్రద్ధ లేదన్నారు. దోమలు విజృంభిస్తున్న పాలకులు, అధికారులకు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఉదయం, రాత్రిళ్లు దోమలు స్వైరవిహారం చేస్తూ ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయన్నారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ, ఫలేరియా, చికున్‌గున్యా లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కొన్ని రోజులుగా నగర ప్రజలు వైరల్ ఫివర్‌తో బాధపడుతూ ఆస్పతుల బాట పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శివర్గ సభ్యులు కె.వి.భాస్కర రావు, కార్యవర్గ సభ్యులు లింగాబత్తుల శివకుమార్, స్థానిక నాయకులు కాళ్ళ చినప్ప, కంది ఆదినారాయణ, పాపారావు, యం.గురునాథం, యం.గురునాథం, సిహెచ్.గురవయ్య, టీ.బ్రహ్మజీ, టీ.నాగరాజు, విజయవాడ ఆటో యూనియన్ కార్యదర్శి గూడెల జనార్ధన్, ఎస్‌కే.రహీం, ఎస్‌కే.నాగూర్, బి.వి.కన్నమ్మ, శంకరమ్మ, రాజ్యలక్ష్మీ, ఎస్‌కే.నన్నే, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆందోళన

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదారులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం డిమాండ్ చేస్తూ ఏపీఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో గురువారం విస్సన్నపేటలో ఆందోళన నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక రెవిన్యూ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.రవికుమార్, ఫణికుమార్‌లు మాట్లాడుతూ, ఉద్యోగులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. 12వ పీఆర్సీని అమలు చేయటంతోపాటు, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్లు మోతియా, విజయభాస్కర్‌లకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'కు సిద్ధం కండి

విశాలాంధ్ర- కంచికచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 27వ తేదీ జేఏసీ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి సిద్ధం కావాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు వేముల భిక్షమయ్య పిలుపునిచ్చారు. ఏపీ జెఎసి ఇచ్చిన దశల వారి ఉద్యమ కార్యాచరణలో భాగంగా గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కంచికచర్లలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ (1)12వ పి.ఆర్.సి. తేదీ 01-07- 2023 నుంచి అమలు కావలసి ఉందని, తక్షణం మార్కెట్ ధరలకు అనుగుణంగా 30% మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. (2) అదేవిధంగా పెండింగ్ ఉన్న రెండు డిఏలు (1-1-23, 1-7-23) తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. (3)అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ విధానం ను రద్దు చేసి ఓ పి ఎస్ విధానం తీసుకు వస్తానని వారి నాన్న గారి సమాది సాక్షి గా చేసిన వాగ్దానం నిలబెట్టు కోవాలని డిమాండ్ చేశారు. ఎన్ని ఉన్నాయి(4) పెండింగ్ లో ఉన్న 11వ పి ఆర్ సి బకాయిలను వెంటనే చెల్లించాలి. (5) ఉపాధ్యాయులకు ఉద్యోగులకు చెల్లించవలసిన జీవిత బీమా భవిష్య నిధి ఆర్థిక సెలవులు కరువు బత్యం బకాయిలు వెరసి 25000 కోట్లు చెల్లించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాల ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు జిల్లా మైనారిటీ కన్వీనర్ షేక్ ఇస్మాయిల్,మండల నాయకులు రాధాకృష్ణ,జేఏసీ నాయకులు రాయన్న, ఏడుకొండలు,శ్రీనివాస రావు యుటిఎఫ్ నాయకులు పుల్లారావు మరియు పాఠశాల లోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివాదంగా భవననిర్మాణం

అధికారుల జోక్యంతో నిలిచిన పనులు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో ఒక భవన నిర్మాణం వివాదానికి దారి తీయటంతో అధికారులు నిర్మాణ పనులను నిలిపివేశారు. వివరాల్లోకి వెళితే స్థానిక ఇందిరానగర్ ప్రాంతానికి ప్రధాన రహదారి నుంచి వెళ్లే రోడ్డుకు ఒకవైపున నిర్మాణదారులు భారీ భవన నిర్మాణం చేపట్టారు. దీనిలో కిందిభాగంలో దుకాణాలు ఏర్పాటు చేస్తూ 10కి పైగా షట్టర్లు ఏర్పాటు చేశారు. తమ ప్రాంత ప్రజలంతా పోరాడి మండలపరిషత్తు స్థలంలో రహదారి ఏర్పాటు చేసుకున్నామని తాజాగా ఎటువంటి హక్కులు లేని వ్యక్తులు ఇక్కడ భారీ భవనాలు నిర్మిస్తూ దుకాణాలు ఏర్పాటు చేయటం వల్ల తమ ప్రాంతానికి ఉండే రహదారి ఆక్రమణల పాలవుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇందిరానగర్‌కు చెందిన నిర్మాణపనులను అడ్డుకున్నారు. గృహనిర్మాణం పేరుతో పంచాయతీ నుంచి అనుమతులు పొంది, ఇలా దుకాణాలు నిర్మించటం ఎంతవరకు సబబని ఈ సందర్భంగా స్థానికులు ప్రశ్నించారు. అధికారులకు ఫిర్యాదు చేయటంతో ఈవోఆర్డీ ఝాన్సీరాణి, ఈవో మురళితో కలసి భవనాన్ని పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా భవనం నిర్మిస్తే చర్యలు తీసుకుంటామని, నిర్మాణపనులు నిలిపివేయటంతో పాటు, ఏర్పాటు చేసిన షట్టర్లను వెంటనే తొలగించాలని ఆమె ఆదేశించారు. ఇలా చేయకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవలసి వస్తుందని హెచ్చరించారు.

చంద్రు కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-ఎ.కొండూరు : మండలంలోని చీమలపాడు పిఎసిఎస్ పరిధిలోని కృష్ణారావు పాలెం గ్రామానికి చెందిన సంఘ సభ్యుడు భూక్యా చంద్రు నాయక్ అనారోగ్యంతో గురువారం మృతి చెందగా,ఆ కుటుంబానికి, సహకార సంఘం, కంభంపాడు కేడీసీసీ బ్యాంక్ తరఫున మట్టి ఖర్చుల నిమిత్తం రూ 10,వేల ఆర్థిక సహాయాన్ని సంఘ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం, ప్రమాదాల వల్ల సంఘ సభ్యులు మృతి చేందితే సహకార సంఘం తక్షణ ఆర్థిక సహాయంతో ఆ కుటుంబాన్ని ఆదుకుటుందన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టరులు, కేడిసీసీ బ్యాంక్ మేనేజర్ పజ్జూరి సత్యనారాయణ, సూపర్ వైజర్ ఎన్.వి. సుబ్బారావు పిఎసిఎస్ సిఈవో ఎలుగు కుటుంబరావు, సంఘ సిబ్బంది వైఎస్ఆర్ సి పి నాయకులు పర్వతనేని చంద్రమోహనరావు,షేక్ అమీన్ ఉప సర్పంచ్ అమీన్, భూక్యా వెంకటేష్ నాయక్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పారిశ్రామిక సమ్మె జయప్రదం చేయాలి

విశాలాంధ్ర తిరువూరు : కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా దేశ వ్యాప్తంగా తలపెట్టిన ఫిబ్రవరి 16 న పారిశ్రామిక సమ్మె ను జయప్రదం చేయాలని కోరుతూ తిరువూరు ఏఐటీయూసీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ద్విచక్ర వాహనాలతో ప్రదర్శన నిర్వహించారు. తనంతరం తూమ్ కృష్ణయ్య మాట్లాడుతూ 365 రోజులు పాటు ఎండ వాన చలి అన్నిటినీ కూడా లెక్కచేయకుండా ఉద్యమం చేయడం జరిగింది భారతదేశంలో అది ఒక స్వతంత్ర సంగ్రామ పోరాటంల ఉద్రిక్తత సాగింది భారత జాతీయ ప్రధాన ప్రధాని క్షమాపణ చెప్పి మూడు నల్ల చట్టాలను రద్దు చేయడం జరిగింది రద్దు చేసిన తరువాత భారత రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధరను కావాలని అలాగే స్వామినాథన్ కు సిఫారసు చేయాలని ఇంకా మరెన్నో డిమాండ్లు వారి ముందు పెట్టారు. కానీ మళ్ళీ సంవత్సర కాలం అయినా వాటిని అమలు జరపకపోగా ఆ నల్ల చట్టాలు ఉపసంహరించకపోగా రైతు సోదరులు ఢిల్లీని ముట్టడించగా ఢిల్లీ సరిహద్దుల్లో రైతులను వెళ్ళనీయకుండా ఈ దేశాన్ని అన్నం పెట్టే రైతన్నలను లాఠీలతోను వాటర్ ట్యాంకులతోనూ ఇబ్బంది ఈ దేశ ప్రధాని నిర్వహిస్తున్నారు. అయినా కూడా మేము ఇక్కడి నుంచి కదిలేది లేదని మా సమస్యలు పరిష్కారం కదిలేది లేదు అని రైతులందరూ అక్కడే వంటలు చేస్తూ అక్కడే ఉండి వారి ఉద్యమాన్ని కొనసాగించడం సాగుతుంది మరి మళ్లీ మరో ఉద్యమానికి కార్యాచరణ జరిగింది దేశవ్యాప్తంగా ప్రధాని అనుసరిస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తూ కార్యవర్గ పారిశ్రామిక గ్రామీణ బందును నిర్వహించాలని ఫిబ్రవరి 16న జరగనున్న బందు జయప్రదం చేయాలి జరగబోయే బందుకు భారత కమ్యూనిస్టు పార్టీ పూర్తి మద్దతు తెలిపారు. తిరువూరు గంపలగూడెం విస్సన్నపేట ఏ కొండూరు రైతులను కార్మిక సోదరులను ఫిబ్రవరి 16న తలపెట్టిన పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా తిరువూరు నియోజకవర్గ అధ్యక్షులు ఎస్కే మీరా కార్పెంటర్, తూమ్ కృష్ణయ్య సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏఐటియుసి ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి మాలపాటి ఉదయ్, ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎస్కె సుభాని తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమల్లో వివక్ష : పోతిన

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కులం, మతం చూడమని చెప్పి, సంక్షేమ పథకాలు అమల్లో వివక్ష చూపారని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌ఛార్జ్ పోతిన వెంకట మహేష్ అన్నారు. ఇంటింటికి రాబోయే మన జనసేన, టీడీపీ ప్రభుత్వం కార్యక్రమం పూర్ణానందంపేటలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనంతా తప్పటగులు, కోర్టు మొట్టికాయల్లా సాగిందని అన్నారు. కులం, మతం ప్రాంతం పార్టీ చూడమని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలులో వివక్ష చూతున్నారని విమర్శించారు. ఇక జగన్మోన్‌రెడ్డి అవినీతి, అరాచక పాలనకు చరమగీతం పాడాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగలాంటే జనసేన, టీడీపీ ప్రభుత్వం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నారాయణపుస్వామి, ప్రదీప్ రాజ్, జనసేన, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

పాలకేంద్రం భవనం ప్రారంభం



విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మండలంలోని చెవిటికల్లు గ్రామంలో ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.3.75 లక్షలు కేడియంపిఎంసియు నిధులు రూ.50 వేలు వెరసి మొత్తం కలిపి రూ.4.25 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన పాల సేకరణ కేంద్రం భవ నాన్ని శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుంద న్నారు.ప్రభుత్వ సహకార పాల డైరీలను అమూల్ తో భాగస్వామ్యం చేయడం ద్వారా పాడి రైతుకు గిట్టుబాటు ధరతో ఆర్థిక భరోసా కల్పిస్తుందని తద్వారా పాడి రైతులు ఆర్థికంగా నిలదొక్కు కుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మలక్ బషీర్ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి : మంత్రి జోగి

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : పేదల అభ్యున్నతికి కోరకు పరితపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నందు వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిమహిళ డ్వాక్రా రుణామాఫిని చేసి అక్కచెల్లెమ్మల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. రెడ్డిగూడెం మండలంలో 12,447 మంది డ్వాక్రా మహిళలకు నాల్గొవ విడత వైఎస్సార్ ఆసరా కింద రూ. 8.74కోట్లు అక్క చెల్లెమ్మల అకౌంట్లలోని జమ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రతి అక్కకు, చెల్లెమ్మలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అండగా నిలుస్తూన్నారన్నారు. మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన అతి సామాన్యుడు అయిన సర్నాల తిరుపతిరావును సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎంపిక చేయడం జరిగిందన్నారు. అతనిని అశీర్వాదించాలని కోరారు. ఈకార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), మైలవరం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త సర్నాల తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, మైలవరం మార్కెట్‌యార్డు చైర్మన్ అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

VIMS COLLEGE OF PHYSIOTHERAPY
22-10, Dhanekula Towers, Saipuram Colony, GOLLAPUDI - 521 225. Vijayawada, NTR Dist. AP.

Applications are invited for Admissions into **MPT** course duration of 2 years from the intended Candidates under Management Quota Seats Min. qulification for Admission is **BPT** pass.

Secretary & Correspondent

CHANGE OF NAME

I, **KHURSEDA BEGUM** (Old Name), W/o. **SHAIK AKBAR BASHA,** resident of Door.No.39-3-19/8A, Maseed street Labbipet, Vijayawada, N.T.R District, Andhra Pradesh. Have changed my name from **KHURSEDA BEGUM** (Old Name) to **SHAIK SIDDIQUA BEGUM** (New Name). Hereafter my name is known as **SHAIK SIDDIQUA BEGUM.**

CHANGE OF NAME

I, **MOHAMMED SHEHANAZ** (Old Name), W/o. **MOHAMMED ARIF,** resident of Door.No.75-4-61, Rangun Saheb Street, Bhavanipuram, Vijayawada, N.T.R District, Andhra Pradesh. Have changed my name from **MOHAMMED SHEHANAZ** (Old Name) to **MOHAMMED SHAHNAZ** (New Name). Hereafter my name is known as **MOHAMMED SHAHNAZ.**

వ్యాపారులకు చేదోడుగా ప్రభుత్వం : ఆసీఫ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాష్ట్రంలో వ్యాపార వర్గాలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేదోడుగా ఉంటుందని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆసీఫ్ అన్నారు. కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ పాలకవర్గాన్ని ఆ సంఘ కార్యాలయంలో గురువారం ఆసిఫ్ కలిసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పాలకవర్గ అధ్యక్షులు బచ్చు వెంకటప్రసాద్, ప్రముఖులు స్వాగతం పలికి పాలకవర్గ కార్యాలయం లోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ తాను గతంలో ఈ డివిజన్ కార్పొరేటర్‌గా పని చేసిన సమయాన్ని గుర్తు చేశారు. అలాగే వస్త్రలతతో పాటుగా కృష్ణవేణి మార్కెట్ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి అండగా ఉన్న విషయాన్ని వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యాపార, కార్మిక వర్గాలన్ని అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బచ్చు వెంకటప్రసాద్‌తో పాటుగా వల్లంకొండ వీరముని బ్రహ్మానందరావు, గొంట్లా కృష్ణమూర్తి, వల్లంకొండ సూర్యశేషసత్యవరప్రసాద్, వోలేటి సుబ్రహ్మణ్యం, ఆత్మకూరి నాగవెంకటహనుమంతరావు, గ్రంధి రామ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ ఆంధ్ర రాష్ట్రాన్ని ముంచారు : వెలంపల్లి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముంచివేశారని, ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గంలో గడప గడప కు మన ప్రభ్యుత్వం కార్యక్రమం లో భాగంగా స్థానిక 32వ డివిజన్ అయోధ్య నగర్ తదితర ప్రాంతాలలో స్థానిక వైస్సార్సీపీ ఇంచార్జ్ కో అప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి,సుందర్ పాల్ తదితరులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రం ఇస్తూ ప్రజలతో మాట్లాడుతూ పర్యటించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో అయోధ్యనగర్‌ను మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దామన్నారు. డ్రైనేజీలు కాల్వగట్లు కోసం రూ.450 కోట్లు మంజూరు చేస్తే బోండా ఉమా అవినీతికి పాల్పడ్డాడన్నారు.కమిషన్స్ దందాకి కేరాఫ్ అడ్రస్ బోండా ఉమా అని దుయ్యబట్టారు. ఆలీబాబా అరడజన్ దొంగలో టీడిపి కార్పొరేటర్లు ఉన్నారన్నారు. బోండా ఉమా కమిషన్ కు కక్కుర్తిపడి విజయవాడ నగర అభివృద్ధిని మొత్తాన్ని నాశనం చేశారన్నారు. రాష్ట్రంలో డ్వాక్రా మహిళలు రుణమాఫీ అని చెప్పి మహిళ లోకాన్ని మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్,బీజేపీ ఆంధ్ర రాష్ట్రాన్ని ముంచివేశారన్నారు.వీరి ముగ్గురు వివిధ రూపంలో రాష్ట్రాని ముంచేయటానికి వచ్చిన తోడేళ్లు అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతూ శైలజ రెడ్డి,సెంట్రల్ నియోకవర్గ కార్పొరేటర్లు డివిజన్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర-చల్లపల్లి : ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ 27వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పాగోలు ఎన్టీఆర్ మోడల్ స్కూల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, మాజీ ఎంపీపీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, షేక్ నజీర్, నిడమానూరి దిలీప్‌కుమార్, నాదెళ్ల వెంకట నరసయ్య, మేకా శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా అనాథ పిల్లలకు ఉచిత విద్య, బ్లడ్ బ్యాంకు ద్వారా రక్తసేకరణ, తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఉచితంగా రక్తం సరఫరా, ఉచిత వైద్యశిబిరాల నిర్వహణ, మహిళా సాధికారిక కార్యక్రమాలు, న్యూట్రిఫుల్ యాప్ ద్వారా ఉచిత వైద్య సలహాలు, ఎన్టీఆర్ సుజల ద్వారా పరిశుభ్రమైన తాగునీటి సరఫరాతోపాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎన్టీఆర్ ట్రస్టు అత్యంత సమర్థవంతంగా నడిపిస్తున్న మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి. మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపల్ డి.అప్పలనాయుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి బోటింగ్ క్లబ్ వార్షికోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ(లబ్బీపేట) : అమరావతి బోటింగ్ క్లబ్ వారి 7 సంవత్సరాల వార్షికోత్సవాన్ని బుధవారం భవానీ ఐలాండ్ మెయిన్ బ్రాంచ్‌లో జరుపుకుంది. సంస్థ సీఈవో డాక్టర్ తరుణ్ కాకాని కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించి, ఉద్యోగులకు కంపెనీ క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 2017 ఫిబ్రవరి 14న తన భార్య శ్రీమతి పవిత్రా కొండ్రెడ్డి, తాను కలిసి స్థాపించిన సంస్థ గత 7 ఏళ్లలో కోవిడ్, వరదలు, నిబంధనల మార్పు, మార్కెట్ పోటీ, మారుతున్న పోకడలతో పాటు ఎన్నో అడ్డంకులను అధిగమించిందన్నారు. డాక్టర్ తరుణ్ ఈ సందర్భంగా %ఆాదీజ% యొక్క పోషకులు మరియు పర్యాటకులకు ధన్యవాదాలు తెలిపారు మరియు అన్ని వయసుల అంతర్జాతీయ మరియు దేశీయ పర్యాటకులతో సహా ఇప్పటివరకు 10 లక్షల (1 మిలియన్) మందిని చూసినందుకు కంపెనీ గర్వంగా ఉందని అన్నారు. పర్యాటకులకు థ్రిల్లింగ్ మరియు సురక్షితమైన అనుభవాన్ని అందించినందుకు %ఆాదీజ% 2021,2022,2023లో ఉత్తమ వాటర్‌స్పోర్ట్స్ ఆపరేటర్‌గా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ నుండి మూడు అవార్డులను గెలుచుకుంది. %ఆాదీజ% కూడా భారతదేశ పర్యాటకం, పర్యాటక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వంచే సర్టిఫికేట్ పొందింది. బోట్ ఆపరేటర్లకు లైసెన్స్‌లను జారీ చేయడానికి (యాచింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) యొక్క అధీకృత శిక్షణా కేంద్రం. ప్రస్తుతం %ఆాదీజ% ఆంధ్ర ప్రేష్ (2 స్థానాలు - భవానీ ద్వీపం మరియు దుర్గా ఘాట్) మరియు ఒడిషా (3 స్థానాలు- బార్కుల్, తంపారా, కటక్)లోని 2 రాష్ట్రాలు నిర్వహిస్తోంది మరియు త్వరలో ఇతర భూభాగాలకు విస్తరించాలని యోచిస్తోంది. డాక్టర్ కాకాణి ప్రభుత్వ అధికారులు, పర్యాటక శాఖ, మీడియా మరియు పర్యాటకులకు కృతజ్ఞతలు తెలిపారు మరియు వారు తమ సంస్థ అమరావతి బోటింగ్ క్లబ్ ద్వారా భద్రతా ప్రమాణాలను నిర్వహిస్తారని మరియు కొత్త థ్రిల్లింగ్ మరియు ఆనందకరమైన అనుభవాలను అందిస్తారని హామీ ఇచ్చారు.

సిద్దార్థ్ రాయ్ సినిమా చిత్రబృందం సందడి

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీ పేట : విజయవాడలో సిద్దార్థ్ రాయ్ సినిమా చిత్రబృందం సందడి చేసింది. ఫిబ్రవరి 23 తేదీన సినిమా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర ప్రమోషన్ లో భాగంగా బెంజ్ సర్కిల్ సమీపంలోని జెడి ఫ్యాషన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చిత్ర యూనిట్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడమైనది.. ఈ సందర్భంగా హీరో దీపక్ సరోజ్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే విధంగా సినిమా ఉంటుందని హీరో తెలిపారు. యూత్ కు మెచ్చే విధంగా సినిమా ఉంటుందని చెప్పారు. దర్శకుడు యశస్వి సినిమాను అద్భుతంగా తీసారని తెలిపారు. తను అగ్ర హీరోల సరసన బాల నటుడిగా ఎన్నో చిత్రాలలో నటించానని అదే అనుభవంతో తన మొదటి చిత్రం సిద్ధార్థ రాయ్ లో హీరోగా నటించడం జరిగిందన్నారు. అర్జున్ రెడ్డి తరహాలో ఈ చిత్రం ఉండబోతుందని ఇప్పటికే విడుదలైన పాటలు టీజర్ ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. విజయవాడ నగరం నుంచి తమ చిత్రం ప్రమోషన్ ప్రారంభించామని దుర్గమ్మ ఆశీస్సులతో తమ చిత్రం విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్స్ ఉన్నారని వారు ఎంతో చక్కగా నటించారని ఆ ఇద్దరి నటన సినిమాకు మూలాధారమన్నారు. తమ చిత్రంలో రొమాంటిక్ సన్నివేశాలు అధికంగానే ఉన్నాయని అయితే సన్నివేశానికి తగ్గట్టుగానే అవి వస్తాయని కుటుంబ సమేతంగా ఈ చిత్రాన్ని చూడవచ్చని హీరో తెలిపారు. అనంతరం హీరోయిన్స్ తన్వినేగి, కళ్యాణి మాట్లాడుతూ అర్జున్ రెడ్డి చిత్రానికి సంగీతం అందించిన రథన్ సిద్ధార్థ రాయ్ చిత్రానికి సంగీతం అందించారని ఈ చిత్రంలోని పాటలు మనసుకు హత్తుకునేలా ఉంటాయని తెలిపారు. ప్రతి సీన్ ఒక ఎమోషనల్ గా సాగుతుందని ప్రేక్షకులు ఈ చిత్రాన్ని వీక్షించి తమను ఆదరించాలని కోరారు.

10కె, 5కె రన్ విజయవంతం

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్ రజతోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి 10కె, 5కె రన్ విజయవంతంగా ముగిసాయి. గుడివాడ ఆటోనగర్ సమీప నుండి పురుషుల 10కె పరుగు అంగలూరు సమీపం నుండి మహిళల 5కె పరుగు ప్రారంభమై గుడ్లవల్లేరు రైల్వే స్టేషన్ సమీపంలో గల సాయిబాబా మందిరం వద్ద ముగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మరియు వేడుకల కన్వీనర్ డాక్టర్ బుల్లా కరుణ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 600 మంది ఔత్సాహికులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని 19 జిల్లాల నుండి పాల్గొన్నారని, ఇందులో 8 సంవత్సరాల వయస్సు నుండి 74 సంవత్సరాల వయస్సు వారు ఉన్నట్లు కన్వీనర్ తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ (ఇం) సత్యనారాయణ రావు వల్లూరుపల్లి జెండా ఊపడం ద్వారా రన్ ప్రారంభమైనట్లు ప్రకటించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా వైద్య సదుపాయాన్ని డాక్టర్ ఉమ, వేణుగోపాల రావు మరియు సిబ్బంది అందించగా, గుడివాడ మరియు గుడ్లవల్లేరు పోలీస్ యంత్రాంగం సహాయంతో రజతోత్సవ 10%ఆ, 5%ఆ రన్ సజావుగా పూర్తయినట్లు డాక్టర్ కరుణ కుమార్ తెలిపారు. గుడివాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏసు బాబు, గుడ్లవల్లేరు ఎస్.ఐ. సత్యనారాయణ మరియు పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో రన్ కు మరియు ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయం లేకుండా పర్యవేక్షించినట్లు కన్వీనర్ తెలిపారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన పురుషుల మరియు మహిళల విజేతలకు రూ.1,17,000/- ల నగదు పారితోషికాన్ని, రజతోత్సవ పతకాలను మరియు ప్రశంసా పత్రాలను గుడివాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ ఏసు బాబు, మరియు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీస్, కృష్ణా జిల్లా డైరెక్టర్ శ్రీమతి రూప్యారాణి చేతుల మీదుగా అందజేశారు. 10కె రన్ విభాగంలో మొదటి, రెండవ, మూడవ, నాల్గవ, ఐదవ స్థానాలను కె.పైడప్ప, విజయవాడ, ఎం.హరీష్, విజయనగరం, టి.బ్రహ్మారెడ్డి, విజయవాడ, ఎం.సత్య, విశాఖపట్నం, కె.సమరాజ్, కడప, 5కె రన్ విభాగంలో మొదటి, రెండవ, మూడవ, నాల్గవ, ఐదవ స్థానాలను ఎల్.మేరీ గ్రేస్, విశాఖపట్నం, బి.కరుణ శ్రీ, విశాఖపట్నం, పి.రత్న అనూష, గుడివాడ, బి.అర్చన, భీమవరం, పి.మేరీ జోత్స్న, గొడవర్రు లు కైవసం చేసుకున్నారు. మరికొంత మందికి ప్రత్యేక నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ %ఆ% కరస్పాండెంట్ సత్యనారాయణ రావు వల్లూరుపల్లి, కో సెక్రెటరీ %ఆ% కరస్పాండెంట్ రామకృష్ణ వల్లూరుపల్లి, గవర్నింగ్ బాడీ సభ్యులు వెంకట కిరణ్ వల్లూరుపల్లి, ముసునూరి శ్రీరామ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుల్లా కరుణ కుమార్, యాజమాన్య సంచాలకులు డాక్టర్ పి. రవీంద్ర బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్. శాస్త్రి, ఫిజికల్ డైరెక్టర్లు ఎం. శివ శంకర్, జె. వెంకటేష్, డి. పూజిత లు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

నాడు నేడు స్కూళ్ల పరిస్థితిపై వెనిగండ్ల సెల్ఫీ ఛాలెంజ్

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గుడ్లవల్లేరు మండలంలోని గ్రామ గ్రామాన పర్యటిస్తున్న గుడివాడ టీడీపీ ఇంచార్జ్ వెనిగండ్ల రాము గురువారం మామిడికోళ్ల గ్రామంలో పర్యటించారు. ఈ గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల దుస్థితిని సెల్ఫీ వీడియో తీస్తూ ప్రభుత్వానికి రాము ఛాలెంజ్ చేశారు.ఈ స్కూల్ పరిస్థితి పై రాము మాట్లాడుతూ టీడీపీ హయాంలో 36లక్షల నిధులతో ప్రారంభమైన పాఠశాల పనులు,నాలుగేళ్లలో పునాదులు కూడా దాటి నిర్మాణం జరగలేదని నిలదీశారు.పాఠశాల నిర్మాణానికి గ్రామస్తులు 15సెంట్ల భూమి ఇచ్చి టీడీపీ ప్రభుత్వం 36లక్షలు మంజూరు చేసినా నేటి వరకు పాఠశాల భవనం నిర్మించ లేకపోయారంటే హాస్యాస్పదంగా ఉందని స్కూల్ బిల్డింగ్ లేకుండా బాత్రూం, కుకింగ్ రూమ్ ముందు కట్టడంతో పాలకుల ఎంత మేధావులో అర్థమవుతుందని అన్నారు.మా గుడివాడ ఎమ్మెల్యే నాని కూడా ప్రజలకు బస్తాండు అవసరమైతే ముందు డిపో కట్టడని ఎద్దేవా చేశారు.ప్రభుత్వ చేతకానితనానికి గుడివాడ నియోజకవర్గంలో దర్శనమిస్తున్న పాఠశాలలే నిదర్శనం అని పేర్కొన్నారు.వైకాపా ప్రభుత్వానిది ప్రచార ఆర్బాటం తప్ప క్షేత్రస్థాయిలో అంతా సున్నానే అని సున్నానే సూచిస్తుంది అన్నారు. ఇప్పటికీ గ్రామాల్లో పాఠశాలల పరిస్థితులు ఇలాగే ఉన్నాయి అని అన్నారు.రేపు తమ ప్రభుత్వం రాగానే ముందుగా ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న పాఠశాల నిర్మాణాలు పూర్తికి ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు.

ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండల కేంద్రమైన గుడ్లవల్లేరులోని స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల యందు మెడి అసిస్ట్ టిపిఏ బెంగుళూరు వారు ఈరోజు బి.ఫార్మసీ ఆఖరి సంవత్సర విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ప్రాంగణ ఎంపికలలో 20మంది విద్యార్థుల ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డా.ఎ. లక్ష్మణ్ రావు తెలిపారు. ఈ ఎంపికలు రెండు దఫాలుగా నిర్వహించారు. మొదటి రౌండ్లో భాగంగా గ్రూప్ డిస్కషన్, రెండవ రౌండ్ టెక్నికల్ ఇంటర్వ్యూ జరిగిందని ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ శ్రీ వి.ఎల్. వినోద్ కుమార్ తెలియజేశారు. ఈ ప్రాంగణ నియామకాలకు 55 మంది విద్యార్థులు హాజరు కాగా 25 మంది విద్యార్థులు మొదటి రౌండ్కు అర్హత సాధించగా రెండవ రౌండు అనంతరం 20 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించారు. ఎంపిక కాబడిన విద్యార్థులు ఇన్సూరెన్స్ క్లైమ్ ప్రాసెస్ ఎగ్జిక్యూటివ్ అనే పోస్ట్ కి అర్హత సాధించారని తెలిపారు. ఈ సందర్భముగా ప్రాంగణ ఎంపికలలో విజయం సాధించిన విద్యార్థులను యాజమాన్య సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ మరియు అధ్యాపకులు మనః పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధులకు భోజనం పంపిణీ

విశాలాంధ్ర-గుడివాడ : మల్లంపల్లి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు మల్లంపల్లి వెంకట్రావు సోదరుడు రామకృష్ణారావు 9వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక కరుణా పీఠంలోని వృద్ధులకు గురువారం బిర్యాని రొట్టెలు, పండ్లు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లంపల్లి వెంకట్రావు మాట్లాడుతూ తన కృష్ణారావు తన ఉద్యోగిగా సేవాగా బావించి ప్రతి ఒక్కరితో ఎంతో ఆప్యాయంగా ఉండేవారన్నారు. ఆయన జ్ఞాపకార్థం ఇలాంటి సేవా చేయడం నా అదృష్టంమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, జాజుల తాతారావు, చలసాని శ్రీకృష్ణ, గొర్రెల పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు.

'రాజధాని ఫైల్స్' సినిమా నిలిపివేత

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి కోమల థియేటర్లో గురువారం ప్రదర్శించిన రాజధాని ఫైల్స్ సినిమాను రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. మార్నింగ్ షో ప్రదర్శన ఇంటర్వెల్ వరకు జరుగ్గా ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వో మట్ట అంజనేయులు థియేటర్కు వచ్చారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు సినిమా ప్రదర్శన నిలిపివేయాలని కోరి ప్రదర్శన నిలిపివేయించారు. ఈ సమయంలో థియేటర్లో ఉన్న ప్రేక్షకులుబయటకు వచ్చి రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. సినిమా ప్రదర్శన మధ్యలోనే నిలిపివేయించటం సరికాదంటూ మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాలను తాము పాటిస్తున్నామని రెవెన్యూ అధికారులు సమాధానమివ్వడంతో అక్కడినుండి వెళ్లిపోయారు.

ఎంపీపీ స్కూల్ పరిశీలించిన మినిస్ట్రీ ఆఫ్ఎడ్యుకేషనల్,టీమ్.

విశాలాంధ్ర-కంచికచర్ల: ఆంధ్రప్రదేశ్లోని 3,5 తరగతుల వారికి జరుగుచున్న టీచింగ్ ఆట్ రైట్ లెవెల్ అనే ప్రోగ్రాం ను పరిశీలించుటకు స్థానిక ఎంపీపీ స్కూల్ కంచికచర్ల నందు మినిస్టర్ ఆఫ్ ఎడ్యుకేషనల్ డిపార్ట్మెంట్ జాంబియా, ప్రథం ఇంటర్నేషనల్ టీం, టి ఎ ఆర్ ఎల్ స్టేట్ టీం సందర్శించారు. వారు పాఠశాలలోని టి ఎ ఆర్ ఎల్ కార్యక్రమం జరుగుతున్న విధానాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ, ప్రధానోపాధ్యాయులు లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మరియు సీఆర్పీ నాయకులు పాల్గొన్నారు.

వాలెంటైన్ కలెక్షన్‌ను విడుదల చేసిన భీమా జ్యువెలర్స్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వాలెంటైన్స్ డే వేడుకలు సమీపిస్తున్న వేళ, భీమా జ్యువెలర్స్ సర్వశ్య వాలెంటైన్ కలెక్షన్‌ను విడుదల చేసింది. ఇది ప్రేమ యొక్క స్ఫూర్తిని వేడుకగా జరుపుకునే అద్భుతమైన 18 కేరట్ బంగారం, వజ్రాల ఆభరణాల శ్రేణి. ఈ కలెక్షన్ లో గొలుసులు, ఉంగరాలు, కంకణాలు, చెవి రింగులు వున్నాయి. హృదయపూర్వక భావోద్వేగాల లోతును ప్రతిబింబించే హస్తకళ, మనోభావాలను ప్రతిబింబించేలా ప్రతి ఆభరణం రూపొందించబడింది. ఖచ్చితత్వం మరియు సూక్ష్మ అంశాల పట్ల శ్రద్ధతో, ప్రతి ఆభరణం పూల యొక్క సున్నితమైన అందాన్ని, హృదయాల శాశ్వతమైన ప్రతీకలను కళ్ళ ముందుంచుతుంది. 'సర్వశ్య వాలెంటైన్' కలెక్షన్ ప్రేమ, ప్రశంసల సారాంశాన్ని కలిగి ఉంది.

ఐసిఐసిఐ ప్రూ గోల్డ్ పెన్షన్ సేవింగ్స్ పథకం ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఐసిఐసిఐ ప్రూ గోల్డ్ పెన్షన్ సేవింగ్స్‌ను ప్రారంభించింది. ఇది వన్న ప్రయోజనాలను అందించే పెన్షన్ ఉత్పత్తి. కస్టమర్లు క్రమబద్ధమైన రీతిలో పొదుపు చేయటానికి, ఆర్థికంగా స్వతంత్ర రిటైర్డ్ జీవితాన్ని గడపడానికి కావాల్సిన రిటైర్‌మెంట్ కార్పస్‌ను రూపొందించడానికి ఇది వీలు కల్పిస్తుంది. వినియోగదారులు పెట్టిన పెట్టుబడికి భద్రత అందించటమే కాకుండా కాంప్లిమెంటరీ హెల్త్ చెకప్‌లు, పాక్షిక ఉపసంహరణలను సైతం అందిస్తున్న భారతదేశపు మొట్టమొదటి ప్రోడక్ట్. తమ లిక్విడిటీ అవసరాలకనుగుణంగా మూడు సంవత్సరాల వ్యవధి తర్వాత కస్టమర్‌లు చేసిన పెట్టుబడిలో 25 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చు.

ప్రత్యేక సంఖ్యలో విడుదల చేసిన స్లావియా స్టైల్ ఎడిషన్‌ను స్కోడా ఆటో ఇండియా

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రెండేళ్లలో లక్ష విక్రయాలను అధిగమించిన అనంతరం స్కోడా ఆటో ఇండియా అత్యధికంగా విక్రయమైన తన ఫైవ్-స్టార్ సేఫ్, క్రాష్-టెస్టెడ్ సెడాన్ స్లావియా స్టైల్ ఎడిషన్‌ను పరిచయం చేస్తోంది. ఉత్పత్తి గురించి స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ జనేబా మాట్లాడుతూ "స్లావియా స్టైల్ ఎడిషన్ మేము చాలా ప్రత్యేకమైన, ఇంకా అధిక విలువ కలిగిన ఉత్పత్తిని అందిస్తామనేందుకు మరో ఉదాహరణగా నిలుస్తుంది. ఇది చాలా పరిమిత సంఖ్యలో అందుబాటులోకి వస్తుండగా, మా వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తయారు చేశాం. భారతదేశ వ్యాప్తంగా మా 200-ప్లస్ సేల్స్ టచ్‌పాయింట్‌లలో ఇది అందుబాటులో ఉంటుంది" అని పేర్కొన్నారు.

అమెజాన్ ప్రొపెల్ స్టార్టప్ యాక్సిలరేటర్ సీజన్-3 విజేతలుగా మిరానా టాయ్స్, అవిమీ హెర్బల్, పెర్ఫోరా

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అమెజాన్ ఇండియా మిరానా టాయ్స్, అవిమీ హెర్బల్, పెర్ఫోరాని అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ ప్రొపెల్ స్టార్ట్ అప్ యాక్సిలరేటర్ (ప్రొపెల్ యాక్సిలరేటర్) సీజన్-3 విజేతలుగా ప్రకటించింది. విజేతలు అమెజాన్ నుండి గ్రాంట్ గా లక్ష డాలర్లు పొందారు. మిరానా టాయ్స్, యాప్-నియంత్రిత ఇగ్నైటెడ్ రియాలిటీ గేమ్‌ల ద్వారా డిజిటల్, ఫిజికల్ ప్లే మిళితం చేస్తుంది. వినూత్నమైన స్మార్ట్ టాయ్‌ల శ్రేణిని అందిస్తుంది. అవిమీ హెర్బల్, 85 ఏళ్ల రాధా కృష్ణ చౌదరి, భరత్ నానావతిచే స్థాపించబడింది. ఇది ఆయుర్వేదంలో పాతుకుపోయిన 'హెయిర్ కేర్ సొల్యూషన్' బ్రాండ్, ఇది రోజువారీ జుట్టు సమస్యలకు సమర్థవంతమైన, శాశ్వత నాటి నివారణలను అందిస్తోంది.

ప్రజాస్వామ్యం ఉందా? : దొంతు చిన్న

విశాలాంధ్ర-గన్నవరం : నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం ఉందా ? అని టీడీపీ ప్రధాన కార్యదర్శి దొంతు చిన్న ప్రశ్నించారు.గురువారం గన్నవరం టీడీపీ కార్యాలయంలో ఉంగుటూరు మండలంలో తెలుగు దేశం నాయకుల ఆధ్వర్యంలో కృష్ణ మూర్తి ఇంటి పై గుర్తు తెలియని వారు ఆయనపై దౌర్జన్యం చేసి వారిని భయభ్రాంతు గురిచేసిన ఘటనపై విలేకర్లసమావేశంలో దొంతుచిన్న మాట్లాడుతూ గన్నవరం టిడిపి ఇంచార్జి యార్లగడ్డ వెంకట్రావు కు మద్దతు తెలుపుతున్న టీడీపీ నాయకుల పై పార్టీ కార్యాలయంపై వైసీపీ గుండాలు దాడి చేయటం హేయమైన చర్య అన్నారు ఎమ్మెల్యే వంశీమోహన్ టిడిపిగెలుపు కోసం అనాడు కష్టపడి పనిచేసామనన్నారు. ఎన్నికల రణరంగంలో గెలుపు ఓటమి సహజం అన్నారు. సామరస్యంగా ఓట్లు అడగాలి తప్ప దౌర్జన్యం గుండా గిరి వలన ఓట్లు రావని హెచ్చరించారు రాష్ట్ర మహిళా కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి మాట్లాడుతూ ఎన్నికల్లో మహిళలు తిరగబడి వంశీని ఓడిస్తారని హెచ్చరించారు. కృష్ణ మూర్తికి రక్షణగా టిడిపి పార్టీ అండగా ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండలం తెలుగుదేశం అధ్యక్షులు ఆరుమళ్ళ కృష్ణారెడ్డి ,కాపులపాడు టిడిపి అధ్యక్షులు దేవ్వూరు వెంకటేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షులు సాయిరాం, రాష్ట్ర మహిళ కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి మండవ రమ్య ఈడుపు గంటి కృష్ణమూర్తి మేడిపల్లి రమాదేవి, నాగయ్య కనగసిని రాజా, తదితరులు పాల్గొన్నారు.

అసెట్‌తో మంచి దిగుబడులు

విశాలాంధ్ర-అవనిగడ్డ : అసెట్‌తోనే లద్దె పురుగు, పూతలో పురుగు, తామర పురుగుల నుండి రక్షణ కల్పిస్తుందని, అసెట్‌తోనే మంచి దిగుబడులు సాధ్యం అవుతాయని మహోహార్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మేడమూడి గ్రామంలో ఇందోఫైల్ కంపెనీ రైతులకు గురువారం అవగాహన కల్పించారు. అపరాలు ప్రమాద భరితంగా ఉండే లద్దె పురుగు, మారుకామచ్చల (పూతలో) పురుగు, తామరపురుగు వంటి కీటకాల నుండి రక్షణ పొందాలంటే ఇందోఫైల్ వారి అసెట్ మందును వాడాలని ఇందోఫైల్ కంపెనీ రాష్ట్ర హెడ్ మనోహర్ రెడ్డి రైతులకు అవగాహన సదస్సులో సూచించారు. అపరాల పంట అనేది రైతాంగానికి అత్యంత కీలకం అని అపరాల పంట సాగులో ప్రమాద భరితంగా ఉండే లద్దె పురుగు, మారుకామచ్చల పురుగు, తామరపురుగు వంటి ప్రమాద భరితమైన కీటకాల నుండి రక్షణ పొందాలంటే అసెట్ మందును ఎకరానికి 50 ఎం.ఎల్ చొప్పున పిచికారి చేయాలన్నారు. అనంతరం అసెట్ వాడిన మేడమూడి గ్రామానికి చెందిన రైతులు బచ్చు వెంకట అంజనేయులు, బచ్చు వేణుగోపాల్ లు మాట్లాడుతూ ఇందోఫైల్ కంపెనీ వారి అసెట్ మందును అపరాల పంటలో వాడటం జరిగిందని, పురుగు నియంత్రణతో పాటు రసం పీల్చే పురుగుల వచ్చే మచ్చలు బాగా నియంత్రణ చేసిందని, బాగా పనిచేస్తుందని స్వయంగా పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందోఫైల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ గుమ్మడి నరసింహా, కోడూరు , అవనిగడ్డ, నాగాయలంక, డి.జి.ఓ కొండవీటి సురేష్, అనుమకొండ చలపతి పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

విశాలాంధ్ర-అవనిగడ్డ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 20 వేల రూపాయల విలువ గల మైక్ సెట్‌ను ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, విద్యా సంస్థల అధినేత యర్రమల్ల శ్రీనివాసరావు అందజేశారు. గురువారం ఉన్నత పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో 20 వేల రూపాయల విలువ చేసే పోర్టబుల్ మైక్ సెట్, ఆట వస్తువులు, సర్వ్ కళ్లజోళ్లు ఇన్‌స్పెక్టర్ బ్రాండ్ చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయులు జి.ఎన్.వి గోపాలేకు అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులలో క్రమశిక్షణ పెరగాలని, సోషల్ మీడియా వేదికలకు దూరంగా ఉండాలని సూచనలు చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలకు విచ్చేయడం ఎంతో ఆనందంగా ఉందని, పాఠశాల అభివృద్ధిలో తన వంతు తోడ్పాటు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సిఐ, శ్రీనివాసరావును దుశాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ ఎం.వెంకట రమణ, పిటీలు, అమ్ముల భాను, సనకా శ్రీకాంత్, ప్రకాష్, కోసూరు పూర్ణచంద్రరావులతో పాటు పలువురు పాల్గొన్నారు.